


EVENING EDITION

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

4PM
www.suryaa.com
శుక్రవారం
06-06-2025
పేజీలు: 02






# ఫైనల్‌కు సబలెంక

ఆధునిక టెన్నిస్‌లో మహిళల సింగిల్స్ మహారాణులుగా వెలుగొందుతున్న టాప్ సీడ్స్ అరీనా సబలెంక, ఇగా స్వియాటెక్ (పోలండ్) మధ్య సమరంలో బెలారస్ భామదే పైచేయి అయింది. ఫ్రెంచ్ ఓపెన్‌లో స్వియాటెక్ వరుస విజయాల జోరుకు బ్రేకులేస్తూ సబలెంక ఈ టోర్నీలో తొలిసారి ఫైనల్ చేరింది. మహిళల సింగిల్స్ సెమీస్‌లో ఒకటో సీడ్ సబలెంక.. 7-6 (7/1), 4-6, 6-0తో ఐదో సీడ్ స్వియాటెక్‌పై విజయం సాధించి ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఫిలిప్పీ చార్టర్ వేదికగా సుమారు రెండు గంటల 20 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన పోరులో సబలెంక జోరు ముందు స్వియాటెక్ తేలిపోయింది. ఆరంభ సెట్‌లో 4-1తో వెనుకబడ్డ స్వియాటెక్ ఆ తర్వాత పుంజుకుని 6-7 స్కోరు చేయడంతో టైబ్రేక్ అవసరమైంది. టైబ్రేక్‌లో స్వియాటెక్ పాచిక పారలేదు. కానీ రెండో సెట్‌లో పోలండ్ అమ్మాయి 6-4తో దూకుడు పెంచడంతో మ్యాచ్ మూడో సెట్‌కు దారితీసింది. నిర్ణయాత్మక మూడో సెట్‌లో సబలెంక.. ప్రత్యర్థికి ఒక్క పాయింట్ కూడా దక్కకుండా మ్యాచ్‌ను ముగించడం విశేషం. ఈ ఓటమితో ఫ్రెంచ్ ఓపెన్‌లో 26 విజయాల స్వియాటెక్ విజయాల పరంపరకు బ్రేక్ పడగా వరుసగా నాలుగో టైటిల్ గెలవాలన్న ఆమె ఆశలపైనా నీళ్లు చల్లినైట్టైంది. కాగా గ్రాండ్‌స్లామ్ ఈవెంట్స్‌లో స్వియాటెక్‌పై సబలెంకకు ఇదే తొలి గెలుపు కావడం గమనార్హం. పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో ఆరో సీడ్ నొవాక్ జొకోవిచ్ 4-6, 6-3, 6-2, 6-4తో అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ)ని ఓడించి సెమీస్ చేరాడు. సెమీస్‌లో అతడు ఇటలీ స్టార్ యానిక్ సిన్నర్‌తో తలపడనున్నాడు.

## శ్రీనగర్ టు కాట్రా.. వందేభారత్ టికెట్ ధర రూ.660

చీనాబ్ నదిపై నిర్మించిన బ్రిడ్జ్‌ను ఇవాళ ప్రధాని మోదీ ప్రారంభించారు. ఈ నేపథ్యంలో కాట్రా నుంచి శ్రీనగర్ ప్రయాణించే వందేభారత్ రైలును కూడా ఆయన పచ్చజెండా ఊపి స్టార్ట్ చేశారు. అయితే జూన్ ఏడో తేదీ నుంచి ఆ రైలు నడవనున్నది. శ్రీనగర్ నుంచి కాట్రా, కాట్రా నుంచి శ్రీనగర్‌కు రెండు వందేభారత్ రైళ్లు నడవనున్నాయి. వారానికి ఆరు రోజులు ఆ రైళ్లు ఉంటాయి. ఐఆర్సీటీసీలో ఆ రైళ్లకు చెందిన టికెట్ బుకింగ్స్ ఓపెన్ అయ్యాయి. ఐఆర్సీటీసీ ప్రకారం ఏసీ చైర్‌కార్ టికెట్ ధర 660గా ఉన్నది. ఉదంపూర్-శ్రీనగర్-బారాముల్లా రైల్ లింకు రూట్లో చీనాబ్ బ్రిడ్జ్ కీలకంగా నిలవనున్నది. 272 కిలోమీటర్ల రూట్లో చీనాబ్ బ్రిడ్జ్ కీలకంగా వ్యవహరించనున్నది. సుమారు 43,780 కోట్ల ఖర్చుతో యూఎస్బీఆర్ఎల్ రైల్వే లింకును నిర్మించారు. 36 టన్నెళ్లు, 943 బ్రిడ్జ్‌లు కూడా ఉన్నాయి. కశ్మీర్ వ్యాలీలో ఇప్పుడు రైళ్ల కూత మోగనున్నది. కాట్రాలోని వైష్ణోదేవి పుణ్యక్షేత్రం మార్గంలో వందేభారత్ రైలు ప్రయాణించనున్నది. రెండు జతల వందేభారత్ రైళ్లు ఆ రూట్‌లో తిరగనున్నాయి. ట్రెయిన్ నెంబర్ 26404/26403, మరియు 26401/26402 .. శ్రీనగర్-కాట్రా-శ్రీనగర్ రూట్లో ప్రయాణిస్తాయి. ఒకే ఒక్క స్టాప్ ఇచ్చారు. బనిహాల్‌లో ఆ రైలు ఆగుతుంది. టూరిస్టులు, స్థానికుల కోసం ఈ రైలు సేవలు అందించనున్నట్లు చెబుతున్నారు. వందేభారత్ రైలును సెప్టెంబర్ నుంచి జమ్మూకు పొడిగించనున్నట్లు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. జమ్మూ రైల్వే స్టేషన్‌లో ప్రస్తుతం 5, 6 నెంబర్ల ప్లాట్‌ఫాం నిర్మాణం జరుగుతున్న దని, అవి పూర్తి కాగానే వందేభారత్‌ను పొడిగిస్తామన్నారు. భవిష్యత్తులో ఢిల్లీ, శ్రీనగర్ మధ్య వందేభారత్ స్లీపర్ రైలును నడిపే యోచనలో ఉన్నట్లు రైల్వే అధికారులు చెప్పా రు. రైలు నిర్మాణం పూర్తి అయిన తర్వాత .. దాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. రాజ ధాని, శతాబ్ధి రైళ్ల కన్నా వేగంగా ప్రయాణిస్తుంది.


## రాశీ ఖన్నా హాట్ ట్రీట్

రాశీ ఖన్నా మోడలింగ్ తో తన కెరీర్ మొదలు పెట్టింది. ఈ ముద్దుగుమ్మ ప్రధానంగా తెలుగు, తమిళ చిత్రాల్లో నటించి మెప్పించింది. ఈ అమ్మడు నవంబర్ 30, 1990న న్యూఢిల్లీలో జన్మించింది. డిగ్రీ చదువుకున్న తర్వాత, ఆమె మోడలింగ్‌లోకి ప్రవేశించి, తర్వాత సినిమా రంగంలో అడుగుపెట్టింది. రాశీ 2013లో హిందీ చిత్రం మద్రాస్ కెఫేలో రూబి సింగ్ పాత్రతో సినీరంగ ప్రవేశం చేసింది. అలాగే ఈ సినిమాతో సైమా అవార్డు కూడా అందుకుంది ఈ చిన్నది. తెలుగులో ఎన్నో సూపర్ హిట్ సినిమాల్లో నటించిన ఈ చిన్నది. తమిళ్ లోనూ అదృష్టాన్ని పరీక్షించుకుంది. అలాగే హిందీలోనూ సినిమాలు చేసి ప్రేక్షకులను మెప్పించింది. రాశీ ఖన్నా బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తున్నపటికీ స్టార్ హీరోయిన్ క్రేజ్ మాత్రం అందుకోలేకపోతుంది. అంతే కాదు పెద్ద సినిమా ఆఫర్స్ కూడా ఈ చిన్నదానికి రావడం లేదు. దాంతో రాశి ఫాన్స్ కాస్తనిరాశ వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే సోషల్ మీడియాలో మాత్రం ఈ చిన్నది చాలా యాక్టివ్ గా ఉంటుంది. నిత్యం క్రేజీ ఫోటోలు షేర్ చేస్తూ కుర్రాళ్లను కవ్విస్తుంది. ఓ రేంజ్ లో అందాలు ఆరబోస్తూ నెటిజన్స్ కు నిద్ర దూరం చేస్తుంది ఈ వయ్యారి భామ.



## వాట్సాప్‌కు పోటీగా

# Xచాట్ త్వరలో..




ఎలాన్ మస్క్ ఓ సంచలనం. ఆయన ఏం చేసినా అదో సంచలనం. అయితే.. వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్ వంటి యాప్‌లకు పోటీగా మరో సంచలనాన్ని తీసుకొచ్చాడు. ప్రముఖ మెసేజింగ్ యాప్ వాట్సాప్‌కు పోటీగా ఎక్స్ యాప్ ఇప్పుడు ఎక్స్ చాట్ను తీసుకొచ్చే ప్లాన్ షురూ చేశాడు. ఈ ఎక్స్ చాట్ తన వినియోగదారులకు అంతరాయం లేని, సురక్షితమైన మెసేజింగ్ అనుభవాన్ని అందిస్తామని ఛాలెంజ్ చేస్తున్నాడు. అయితే.. వాట్సప్‌కు పోటీగా వచ్చిన ఈ ఎక్స్ చాట్ యాప్‌లో స్పెషల్ ఫీచర్లేంటో చూద్దాం.. ఎలాన్ మస్క్‌కు చెందిన ఎక్స్ యాప్‌లో కొత్తగా ఎక్స్ చాట్ పేరుతో చాట్ ఇంటర్ ఫేస్‌ను ప్రవేశపెట్టారు. ఈ ఎక్స్ చాట్ అనేది ఇన్-యాప్ డైరెక్ట్ మెసేజింగ్ ఫీచర్. ఇది వాట్సాప, ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్ మాదిరిగానే నిరంతరాయంగా చాట్ చేసుకునే వీలు కల్పిస్తుంది. ఈ ఎక్స్ చాట్‌లో ఎండ్-టు-ఎండ్ ఎన్‌క్రిప్షన్, డిసప్పియరింగ్ మెసేజెస్, ఆడియో/వీడియో కాల్స్ వంటి లేటెస్ట్ ఫీచర్లను హైలైట్ చేస్తూ ఎలాన్ మస్క్ ఎక్స్ వేదికగా వివరాలు ప్రకటించారు. XChat అనేది X యూజర్ల కోసం డెవలప్ చేసిన ఓ కొత్త ఫీచర్. ఇది ఇప్పటికే ఉన్న ప్లాట్‌ఫామ్ డైరెక్ట్ మెసేజింగ్ సిస్టమ్‌పై బిల్డ్ అవుతోంది. సెక్యూర్ కనెక్షన్స్ కోసం ఎండ్ టూ ఎండ్ ఎన్‌క్రిప్షన్ అందిస్తుంది. కొంత టైమ్ తర్వాత మెసేజ్‌లు ఆటోమేటిక్‌గా డిసప్పియర్ అయిపోతాయి. ఏ టైప్ ఫైల్స్ అయినా షేర్ చేసుకోవచ్చు. ఫోన్ నంబర్ అవసరం లేకుండా ఆడియో, వీడియో కాల్స్ మాట్లాడొచ్చు. ఇన్‌స్టంట్ మెసేజింగ్ స్పేస్‌లో ఈ ఫీచర్లతో వస్తున్న ఎక్స్ చాట్, వాట్సాప్ కి బలమైన పోటీ ఇవ్వనున్నట్లు నిపుణులు భావిస్తున్నారు. ప్రస్తుతం బీటా టెస్టింగ్‌లో ఉన్న ఈ అప్‌డేటెడ్ మెసేజింగ్ ఇంటర్ ఫేస్‌ను పరిమిత సంఖ్యలో యూజర్లకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు కంపెనీ వెల్లడించింది. ఎక్స్ చాట్‌లో ఎన్‌క్రిప్టెడ్ మెసేజింగ్, ఫైల్ షేరింగ్, వాయిస్ కాల్స్, వీడియో కాల్స్ వంటి అధునాతన మెసేజింగ్ ఫీచర్లు ఉన్నాయని తెలిపింది. ఈ అప్‌గ్రేడ్ మైక్రోబ్లాగింగ్ ప్లాట్‌ఫామ్ మల్టీపర్పస్ కమ్యూనికేషన్ హబ్‌గా ఎక్స్‌ను అభివృద్ధి చేయాలన్నదే మస్క్ ఆలోచనగా కనబడుతోంది.



## ఆ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

### హైడ్రా కమిషనర్ రంగనాథ్

నాలాల ఆక్రమణలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. వచ్చే నాలుగు నెలల పాటు నాలాలపైనే దృష్టి పెడుతామని, హైదరాబాద్‌లో వరద నీరు నిలిచే ప్రాంతాలపై ప్రత్యేక అధ్యయనం చేస్తున్నామని, నాలా, నీటి వనరుల ఆక్రమణలపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. నాలాలపై అక్రమంగా నిర్మించిన వాణిజ్య భవనాలను తొలగిస్తామని, నాలాలపై పేదల నిర్మాణాల అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని రంగనాథ్ స్పష్టం చేశారు. అక్రమణల వల్ల పేద, మధ్య తరగతి ప్రజలు ఇబ్బంది పడకూడదని హెచ్చరించారు. రసూల్‌పురా నాలాపై ఆక్రమ నిర్మాణాలను కూల్చివేశామని రంగనాథ్ స్పష్టం చేశారు.

## సజ్జల రామకృష్ణారెడ్డికి హైకోర్టులో ఊరట





కడప జిల్లా సీకేదిన్నె మండలం పరిధిలో వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి సోదరుల కుటుంబ సభ్యుల అధీనంలో ఉన్న భూముల విషయంలో సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు ధర్మాసనం పాక్షికంగా సవరించింది. వాటిపై యథాతథ స్థితి పాటించాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఈ నెల 30వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ మండవ కిరణ్మయి, జస్టిస్ టీసీడీ శేఖర్‌తో కూడిన ధర్మాసనం గురువారం ఉత్తర్వులు ఇచ్చింది. సీకే దిన్నె మండలంలో 63.72 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకుంటూ గత నెల 21న జిల్లా కలెక్టర్ ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను సవాల్ చేస్తూ సజ్జల కుటుంబ సభ్యులు పిటిషన్ దాఖలు చేశారు. ఆయా సర్వే నంబర్లలో తమకున్న 201.17 ఎకరాల భూముల విషయంలో అధికారులు జోక్యం చేసుకోకుండా నిలువరించాలని కోరారు. దీనిపై వ్యాజ్యం రాగా ఇటీవల విచారణ జరిపిన హైకోర్టు సింగిల్ జడ్జి.. కలెక్టర్ ఇచ్చిన ప్రొసీడింగ్స్‌పై స్టే విధించారు. దీనిని ప్రభుత్వం అప్పీల్ వేసింది. ఈ అప్పీల్ గురువారం విచారణకు రాగా.. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. 'పిటిషనర్ల అధీనంలో 63.72 ఎకరాల అటవీ, ఇరిగేషన్, అసైన్డ్ భూమి ఉందని అధికారులు గుర్తించారు. అయితే దశాబ్దాలుగా ఆ భూములు తమ అధీనంలో ఉన్నాయని చెబుతున్నారు తప్ప వాటి రికార్డులను పిటిషనర్లు అధికారుల ముందు ఉంచలేదు. ఈ నేపథ్యంలో భూములు స్వాధీనం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రొసీడింగ్స్ ఇచ్చారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన మెమోను పరిగణనలోకి తీసుకోకుండా సింగిల్ జడ్జి ఉత్తర్వులు ఇవ్వడం సరికాదు. వాటిని కొట్టివేయాలి' అని కోరారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి వాదనలు వినిపించారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం అధికారులు నిర్వహించిన పంచనామా చెల్లుబాటు కాదన్నారు. ఇరుపక్షాల వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. సింగిల్ జడ్జి ఉత్తర్వులను పాక్షికంగా సవరించింది.

## ఇంగ్లండ్ సిరీస్ సవాల్ వంటిదే..

### టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్



ఇంగ్లండ్‌తో జ రిగే ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ తమకు సవాల్ వంటిదేనని టీమిండి యా కెప్టెన్ శుభ్‌మన్ గి ల్ పేర్కొన్నాడు. ఇంగ్లం డ్ పర్యటనకు బయలుదేరి వెళ్లేముందు గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రధాన కోచ్ గౌతం గంభీర్‌తో కలిసి గిల్ పాల్గొన్నాడు. ఈ సందర్భంగా త న వ్యూహాల గురించి వెల్లడించాడు. ఇంగ్లండ్ వంటి బలమైన జట్టును వారి సొంత గడ్డపై ఎదుర్కోవడం అనుకున్నంత తేలి కేం కాదన్నాడు. ఇది కెప్టెన్‌గా తనకు తొలి టెస్టు సిరీస్ కావడంతో కాస్త ఒత్తిడి ఉండడం సహజమేనన్నాడు. భారత్ వంటి జట్టుకు సారథ్యం వహించడం చాలా కష్టంతో కూడుకున్న అంశమన్నాడు. అయితే తనపై ఎంతో నమ్మకంతో అప్పగించి న సారథ్య బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించేందుకు సర్వం ఒడ్డుతానని స్పష్టం చేశాడు. సీనియర్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, రవిచంద్రన్ అశ్విన్, షమిలు లేకుండా సిరీస్‌లో బరిలో కి దిగుతున్నామని, ఇది అత్యంత క్లిష్టమైన అంశమన్నాడు. ఇ క జట్టును ఏకతాటిపై తెచ్చి ముందుకు సాగుతానన్నాడు. సీనియర్, జూనియర్ అనే తేడా లేకుండా ప్రతి క్రికెటర్‌తో స్నే హంగా ఉంటూ వారి సలహాలు, సూచనలు తీసుకుంటానన్నాడు. ఆటగాళ్లు ఎలాంటిఒత్తిడి లేకుండా ఆడేందుకు పూర్తి స్వే చ్ఛ ఇస్తానని తెలిపాడు. కోచ్ గౌతం గంభీర్ మాట్లాడుతూ క రుణ్ నాయర్ వంటి ఆటగాడు జట్టులో చేరడం ఆనందంగా ఉందన్నాడు. దేశవాళీ క్రికెట్‌లో అద్భుతంగా రాణించిన నా యర్ ఇంగ్లండ్ గడ్డపై కూడా మెరుపులు మెరిపిస్తాడనే నమ్మ కం తనకుందన్నాడు.

సూర్య www.suryaa.com EVENING EDITION 4PM






# జింఖానా గ్రౌండ్స్ సమ్మర్ క్యాంప్స్ క్లోజింగ్ సెర్మనీ 2025!

వేసవి సెలవుల్లో ఖాళీగా ఉండకుండా తమకు ఇష్టమైన క్రీడలో ప్రత్యేక శిక్షణ పొందారు . జింఖానా గ్రౌండ్స్ సమ్మర్ క్యాంప్స్ క్లోజింగ్ సెర్మనీ 2025.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా విచ్చేసిన శ్రీ మధుకర్ నాయక్, సీఈఓ సికింద్రాబాద్ కంటోన్మెంట్,గౌరవ అతిథి గా అనుప్ కుమార్ యమ, స్కేటింగ్ లో అర్జున అవార్డు విన్నర్ మరియు ఎన్ . సుధాకర్ రావు డివైఎస్ఓ, హైదరాబాద్. ఈ సంవత్సరం సమ్మర్ క్యాంపు 700 పైగా ఆన్లైన్ రిజిస్ట్రేషన్ జరిగాయి. ఇది చాలా సంతోషకరమైన విషయం అని తెలిపారు.చిన్నప్పటి నుంచే ఈ శిక్షణా శిబిరంలో తర్ఫీదు పొందిన క్రీడాకారులు జాతీయస్థా యి టోర్నమెంట్లలో సత్తా చాటారు. ఈ సందర్భంగా సమ్మర్ క్యాంపు క్రీడాకారులు క్రీడా పోటీ నిర్వయించారు. గెలిచిన చిన్నారులకు మెడల్స్ మరియు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ ఏడాది క్రీడాకారులు బాస్కెట్ బాల్‌తో పాటు ఫుట్ బాల్ , వాలీబాల్, క్రికెట్ ,స్కేటింగ్ ,బ్యాడ్మింటన్ వంటి క్రీడల్లో తర్ఫీదు పొందారు .ముఖ్యంగా క్రికెట్ మరియు స్కేటింగ్ క్రీడలో ప్రత్యేక శిక్షణ తీసుకున్న చిన్నారులు.

# అందుకే తుమ్మిడిహట్టి నుంచి మేడిగడ్డకు మార్చాం

కేబినెట్ నిర్ణయం మేరకే ఆనకట్టల నిర్మాణం జరిగిందని బిజెపి ఎంపి ఈటెల రాజేందర్ తెలిపారు. సాంకేతిక కమిటీ, కేబినెట్ కమిటీ సిఫార్సు మేరకు మంత్రివర్గం నిర్ణయం తీసుకుందని వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలపై బిజెపి ఎంపి ఈటెల రాజేందర్ ను జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ విచారించింది. విచారణ ముగిసిన అనంతరం రాజేందర్ మీడియాతో మాట్లాడారు. సిడబ్ల్యుసి, మహారాష్ట్ర అభ్యంతరాల దృష్టా ప్రాజెక్టు లొకేషన్ తుమ్మిడిహట్టి నుంచి మేడిగడ్డకు మార్పు చేశామన్నారు. నిధుల కొరత దృష్టా కాళేశ్వరం కార్పొరేషన్ ఏర్పాటు చేశామని, ప్రారిశ్రామిక, తాగునీటి వినియోగంపై డబ్బు వసూలు చేయాలని డిపిఆర్‌లో ఉందని స్పష్టం చేశారు. బ్యారేజీల నిర్మాణంలో ఆర్థిక క్రమశిక్షణ లోపించిందా ? అని ఈటెలను కమిషన్ ప్రశ్నించింది. బ్యారేజీల నిర్మాణ అంశాలన్నీ నీటిపారుదల శాఖ కిందకే



వస్తాయని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ఆర్థిక మంత్రిగా వ్యవహరించిన ఈటల రాజేందర్‌ను ఇవాళ కమిషన్ ప్రశ్నించిన విషయం తెలిసిందే. ఈనెల 9వ తేదీ సోమవారం రోజున నీటిపారుదల శాఖ మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు కమిషన్ ముందుకు రానున్నారు. ఈనెల 11వ తేదీ బుధవారం రోజున మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును కూడా కమిషన్ విచారించనున్నది.

**కాళేశ్వరం సమాచారమంతా కేసీఆర్, హరీశ్‌రావు వద్దే ఉంది**

భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఎంపీ ఈటల రాజేందర్ శుక్రవారం కీలక వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి మొత్తం సమాచారం మాజీ సీఎం కేసీఆర్ మరియు మాజీ మంత్రి తన్నీ హరీశ్‌రావు వద్దే ఉందని ఆయన పేర్కొన్నారు. కాళేశ్వరం కమిషన్ విచారణ ముగిసిన అనంతరం మీడియాతో మాట్లాడిన ఈటల, ఈ అంశంపై ఆర్థిక శాఖకు పెద్దగా పాత్ర లేదన్నారు. ఆర్థిక శాఖకు ప్రాజెక్టు వివరాలన్నీ తెలిసే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. "కాళేశ్వరం ప్రాజెక్టు రీడిజైనింగ్ కోసం అప్పట్లో ముఖ్యమంత్రి కేసీఆర్ క్యాబినెట్ సబ్‌కమిటీని ఏర్పాటు చేశారు.



## హరి హర వీర మల్లు - కాస్త ఆలస్యం,

# చరిత్ర సృష్టించడానికి సిద్ధం

విడుదల తేదీపై అధికారిక ప్రకటన

ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రియులు అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాలలో 'హరి హర వీర మల్లు' ఒకటి. ఈ చిత్ర విడుదల గురించి జరుగుతున్న ప్రచారాలు, పెరుగుతున్న ఊహాగానాలు నేపథ్యంలో నిర్మాతలు అధికారిక ప్రకటన విడుదల చేశారు. "అచంచలమైన ఓపిక మరియు నమ్మకంతో 'హరి హర వీరమల్లు' సినిమాకు తోడుగా నిలిచిన అభిమానులు, శ్రేయోభిలాషులు మరియు సినీ ప్రేమికులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు. గతంలో ప్రకటించిన జూన్ 12వ తేదీకి చిత్రాన్ని మీ ముందుకు తీసుకురావడానికి అవిశ్రాంత ప్రయత్నాలు చేస్తున్నాము. అయినప్పటికీ ఆ తేదీకి చిత్రాన్ని థియేటర్లలోకి తీసుకురాలేకపోతున్నామని తెలియజేస్తున్నాము. కష్టమైనయినప్పటికీ తప్పనిసరి పరిస్థితుల్లో ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ గారి యొక్క ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని మరింత గొప్పగా మలచాలనేదే మా ప్రయత్నం. ప్రతి ఫ్రేమ్ పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ, అద్భుతమైన చిత్రంగా మలిచే ప్రయత్నంలో నిమగ్నమై ఉన్నాము. అందుకే మేము మరి కొంత సమయం తీసుకుంటున్నాము. మీ ఎదురుచూపులకు బహుమతిగా గొప్ప చిత్రాన్ని అందిస్తామని హామీ ఇస్తున్నాము." మరోవైపు, సామాజిక మాధ్యమాల్లో 'హరి హర వీరమల్లు' చిత్రం గురించి తప్పుడు వార్తలు ప్రచారమవ్వడం మేము గమనించాము. చాలామంది తమకు తోచినది రాసేస్తున్నారు. ధృవీకరించని వార్తలను నమ్మవద్దని, వాటిని వ్యాప్తి చేయవద్దని మేము ప్రతి ఒక్కరినీ కోరుతున్నాము. దయచేసి మా అధికారిక హ్యాండిల్స్ ద్వారా మాత్రమే సినిమాకి సంబంధించిన అప్డేట్ల కోసం వేచి ఉండండి. అప్పటి వరకు, ఎటువంటి ప్రచారాలను నిజమని భావించకండి. 'హరి హర వీరమల్లు' చిత్రం ఒక అద్భుతమైన ప్రయాణం. వందలాది మంది కళాకారులు, సాంకేతిక నిపుణులు కలిసి వెండితెరపై అద్భుతాన్ని సృష్టించడానికి 24 గంటలూ తమ శక్తికి మించి కృషి చేస్తున్నారు. ఈ ఆలస్యం మన సహనాన్ని పరీక్షించవచ్చు. కానీ, అంతకంటే గొప్పది ఏదో రూపుదిద్దుకుంటుందని కూడా ఇది సూచిస్తుంది. ప్రతి దృశ్యం ఆశ్చర్యపరిచేలా, ప్రతి శబ్దం ప్రతిధ్వనించేలా, ప్రతి సన్నివేశం ఎప్పటికీ గుర్తుండిపోయేలా చేయాలనే లక్ష్యంతో చిత్ర బృందం నిర్మాణాంతర కార్యక్రమాలతో ముందుకు సాగుతోంది. 'హరి హర వీరమల్లు' యొక్క భారీ మరియు శక్తివంతమైన థియేట్రికల్ ట్రైలర్ త్వరలో విడుదల కానుందని తెలియజేయడానికి మేము చాలా సంతోషిస్తున్నాము. ట్రైలర్‌తో పాటు, కొత్త విడుదల తేదీని కూడా తెలియజేస్తాము. కాబట్టి భారీ ప్రకటన కోసం వేచి ఉండండి. సినిమాపై రోజురోజుకి అంచనాలు పెరిగిపోతున్నాయి. అద్భుతమైన ట్రైలర్ ను మీతో పంచుకోవడానికి మేము ఆసక్తిగా ఎదురు చూస్తున్నాము. అద్భుతాన్ని చూడటానికి సిద్ధంగా ఉండండి. ఈ చిత్రానికి ఎ. ఎం. జ్యోతి కృష్ణ, క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహిస్తున్నారు.



# ఓటీటీలోకి వచ్చేసిన సింగిల్

తెలుగు సినీరంగంలో గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరోలలో శ్రీవిష్ణు ఒకరు. సామజవరగమన, ఓం భీమ్ బుష్, స్వాగ్ చిత్రాలతో వరుస విజయాలు అందుకున్న ఈ హీరో.. ఈ ఏడాది సింగిల్ మూవీతో మరో హిట్టు అందుకున్న సంగతి తెలిసిందే. కామెడీ ఎంటర్టైనర్ గా వచ్చిన ఈ చిత్రం మే 9న విడుదలై భారీ విజయాన్ని అందుకుంది. బాక్సాఫీస్ వద్ద మంచి కలెక్షన్స్ రాబట్టిన ఈ మూవీకి కార్తీక్ రాజు దర్శకత్వం వహించారు. ఇందులో శ్రీవిష్ణు సరసన కేతిక శర్మ, ఇవానా హీరోయిన్లుగా నటించగా.. శ్రీవిష్ణు, వెన్నెల కిషోర్ కామెడీ సీన్స్ అదిరిపోయాయి. ఈ చిత్రానికి అన్ని వర్గాల అడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. అల్లు అరవింద్ సమర్పణలో విద్య కొప్పినీడి, రియాడ్ చౌదరి, భాను ప్రతాప్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రానికి విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందించారు.ఇదిలా ఉంటే.. ఎలాంటి ముందస్తు ప్రకటన లేకుండా ఈ మూవీ ఆకస్మాత్తుగా ఓటీటీలోకి వచ్చేసింది. జూన్ 6 నుంచి ఈ సినిమా అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవుతుంది. కేవలం తెలుగులోనే కాకుండా తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషలలోనూ ఈ సినిమా అందుబాటులోకి రావడం విశేషం. ఇన్నాళ్లు థియేటర్లలో ఆద్యంతం ప్రేక్షకులను నవ్వించిన ఈ సినిమా ఇప్పుడు ఓటీటీలో సందడి చేసేందుకు రెడీ అయ్యింది.

## డింపుల్ హయాతితో

# రవితేజ మరోసారి..

మాస్ మహారాజ్ రవితేజ హీరోగా మళ్ళీ తన మార్క్ స్పీడ్ తో సినిమాలు కంప్లీట్ చేస్తున్నారు. ఇలా లేటెస్ట్ గా మాస్ జాతర సినిమా తర్వాత తన నుంచి నెక్స్ట్ సినిమాని దర్శకుడు కిషోర్ తిరుమలతో అనౌన్స్ చేయడం అంతే కాకుండా అక్కడ నుంచి షూటింగ్ కూడా మొత్తం సెట్ చేయడం అంతా చకచకా జరిగిపోతున్నాయి. అయితే ఈ సినిమాలో ఇద్దరు హీరోయిన్స్ ఉంటే వారిలో తన సినిమా తోనే ఎంట్రీ ఇచ్చిన 'ఖిలాడీ' బ్యూటీతో మరోసారి నటించనున్నట్టు తెలుస్తుంది. మరి ఆ హీరోయిన్ ఎవరో కాదు డింపుల్ హయాతి అట. మరి డింపుల్ హయాతి రవితేజతో ఖిలాడీ సినిమా తోనే ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇక ఆ సినిమా తర్వాత మళ్ళీ వీరు కలిసి నటించ నున్నారట. ఇక దీనిపై అధికారిక క్లారిటీ ఇంకా రావాల్సి ఉంది. ఇక ఎస్ ఎల్ వి సినిమాస్ వారు నిర్మాణం వహిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది సంక్రాంతి రిలీజ్ కి రాబోతుంది.



# బేగంపేటలో అక్రమ నిర్మాణాలు కూల్చివేత

హైదరాబాద్ లోని బేగంపేటలోని పోలీస్ స్టేషన్‌కు సమీపంలో నాలాపై ఉన్న అక్రమ కట్టడాలను హైడ్రా అధికారులు కూల్చేశారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్, కంటోన్మెంట్ సిఇఒ మధుకర్ నాయక్ గురువారం నాలాను పరిశీలించారు. నాలాకు ఇరువైపుల అక్రమ కట్టడాలను తొలగించాలని అధికారుల ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో శుక్రవారం హైడ్రా అధికారులు నాలాపై ఉన్న అక్రమ నిర్మాణాలను కూల్చేశారు. అక్రమ నిర్మాణాలు కూల్చివేయడంతో హైడ్రాను స్థానికులు ప్రశంసిస్తున్నారు. అక్రమ నిర్మాణాలను తొలగించి నాలాను వెడల్పు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఎంఎల్ఎ మాగంటి గోపీనాథ్

# ఆరోగ్యం అత్యంత విషమం

బిఆర్ఎస్ ఎంఎల్ఎ మాగంటి గోపీనాథ్(62) ఆరోగ్యం పరిస్థితి అత్యంత విషమగా ఉంది. ప్రస్తుతం మాగంటి గచ్చిబౌలిలోని ఎఐజి ఆస్పత్రిలో ఐసియు చికిత్స తీసుకుంటున్నారు. గురువారం సాయంత్రం 4.35 గంటలకు ఆయనకు గుండెపోటు రావడంతో ఎఐజి ఆస్పత్రికి తరలించారు. కార్డియాక్ అరెస్టు గురైనట్టు వైద్యులు గురించి వెంటిలేటర్ చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని, 48 గంటలు దాటితే కానీ ఏమీ చెప్పలేమని వైద్యులు తెలిపారు. గతంలో కిడ్నీ సమస్యతో బాధపడుతూ ఎఐజిలో చేరిన విషయం తెలిసిందే. మాగంటి గోపీనాథ్‌కు గుండె పోటు వచ్చిన సమాచారం తెలియగానే బిఆర్ఎస్ నేతలు హరీష్ రావు, నామా నాగేశ్వర్ రావు, కెపి వివేకానందగౌడ్, మాధవరం కృష్ణారావు, దాసోజు శ్రవణ్, బిఆర్ఎస్ నేతలు ఆస్పత్రికి చేరుకొని వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అమెరికా పర్యటనలో ఉన్న కెటిఆర్ కూడా మాగంటి ఆరోగ్యంపై ఆరా తీశారు.



# బాలికను ఎత్తుకెళ్లి అత్యాచారం... నిందితుడు కాల్చివేత

మూడేళ్ల బాలికను ఎత్తుకెళ్లి చిన్నారిపై అత్యాచారం చేసిన నిందితుడిని పోలీసులు కాల్చి చంపారు. ఈ సంఘటన ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం లక్నోలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దంపతులు బాలిక కలిసి ఆరుబయట పడుకున్నారు. తెల్లవారుజామున నాలుగు గంటల ప్రాంతంలో బాలిక ఏడుపు వినిపించడంతో ఓ వృద్ధుడు ఆ దంపతులకు సమాచారం ఇచ్చాడు. 500 మీటర్ల దూరంలో బాలిక కనిపించడంతో లోకబంధు ఆస్పత్రికి తరలించారు. బాలిక ప్రైవేటు పార్ట్స్ వద్ద గాయాలు ఉండడంతో అత్యాచారం జరిగిందని వైద్యులు నిర్ధారించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సిసి కెమెరాలు ఆధారంగా దీపక్ వర్మ అత్యాచారం చేసి ఉంటాడని గుర్తించారు. అతడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కంటోన్మెంట్ ప్రాంతంలోని దేవి కేడా ప్రాంతంలో అతడు సంచరిస్తుండగా పోలీసులు లొంగిపోవాలని కోరారు. పోలీసులపై దీపక్ కాల్పులు జరపాడు. దీంతో నిందితుడిపై పోలీసులు ఎదురుకాల్పులు జరిపారు.



# ఓటీటీలోకి వచ్చేసిన లాల్ సలామ్

తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్ ప్రధాన పాత్రలో నటించిన లాల్ సలామ్ చిత్రం ఎట్టకేలకు ఓటీటీలోకి వచ్చేసింది. ప్రస్తుతం ఈ సినిమా ఓటీటీ వేదిక అయిన Sun NXT ప్లాట్‌ఫామ్‌లో స్ట్రీమింగ్ అవుతుంది. గతేడాది ఫిబ్రవరి 09న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం థియేటర్లలో ఆశించినంత విజయం అందుకోలేకపోయింది. అయితే ఈ సినిమా విడుదలైన దాదాపు ఏడాది తర్వాత ఓటీటీలోకి వచ్చేసింది. థియేటర్‌లో కట్ వెర్షన్‌ని విడుదల చేయగా.. ఓటీటీలో మాత్రం ఎక్స్‌టెండెడ్ వెర్షన్‌ని విడుదల చేసినట్లు చిత్రబృందం ప్రకటించింది. ఐశ్వర్య రజినీకాంత్ దర్శకత్వం వహించిన ఈ మూవీలో విష్ణు విశాల్, విక్రాంత్ ఇతర లీడ్ రోల్స్‌లో నటించారు. ఇండియన్ మాజీ దిగ్గజ క్రికెటర్ కపిల్ దేవ్ ఈ సినిమాలో కీలక పాత్రలో నటించాడు.